బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 23 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకునే ప్రక్రియను తిప్పి కొట్టాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాత్రికి రాత్రే 10 శాతం ఎందుకు పెట్టాల్సి వచ్చిందని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు జరిగే వరకు తమ పార్టీ పోరాడుతుందన్నారు.

రాజీవ్ విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటామనడం తగదు

నల్లకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడం తగదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటం అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు సిపిరి మనోజ్‌కుమార్‌యాదవ్, బి. రాంచందర్, పునీత్‌కుమార్ సాముల, మజీద్‌బాయ్, ఆగ్రోజ్ శ్రీకాంత్, కమల్ పాల్గొన్నారు.

'సమాజహితం కోసం సోషల్ మీడియా పనిచేయాలి'

నల్లకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమాజహితం కోసం సోషల్ మీడియా పనిచేయాల్సిన అవసరం ఉందని పలువురు సామాజిక కార్యకర్తలు అన్నారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సామాజిక కార్యకర్తలు సీహెచ్ భద్ర, కె. వెంకటనారాయణ, వరప్రసాద్, నర్సిరెడ్డి మాట్లాడారు. ప్రజల సమస్యలు, ఇతరత్రా అంశాలపై కాకుండా వ్యక్తిగత దూషణలపై సోషల్ మీడియా దృష్టి సారించడం సరైంది కాదన్నారు. ఇటీవల ఆధ్యాత్మిక గురువు వేణుస్వామి, ఓ చానెల్ న్యూస్ రీడర్ మూర్తి మధ్యలో నెలకొన్న వైనంపై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ప్రసారం చేయడం శోచనీయమన్నారు. సోషల్ మీడియాలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఫీవర్ ఆస్పత్రిలో ఐదో రోజూ ఓపీ సేవలు బంద్

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిలో బుధవారం 5వ రోజూ ఓపీ సేవలు బంద్ అయ్యాయి. ఐదు రోజుల నుంచి ఓపీని మూసివేయడంతో జ్వరాల బారిన పడి ఆస్పత్రికి వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఎమర్జెన్సీ వైద్యసేవలతోపాటు కుక్కకాటు బాధితులకు వ్యాక్సిన్ మాత్రమే వేశారు. దీంతో జ్వరాల బారిన పడిన వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఫీవర్ ఆస్పత్రిలో ఓపీ సేవలను పునరుద్ధరించాలని పలువురు రోగులు కోరుతున్నారు.

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం వాయిదా

నల్లకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణ ఆత్మగౌరవ భవనం వెల్ఫేర్ ట్రస్ట్ సౌజన్యంతో సెప్టెంబర్ 17న నిర్వహించాల్సిన విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని వాయిదా వేస్తున్నామని ట్రస్ట్ ఛైర్మన్ లాలుకోట వెంకటాచారి తెలిపారు. 22వ తేదీన ఉప్పల్ భగాయత్‌లోని ఆత్మగౌరవ భవనంలో నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం కమిటీ వైస్ ఛైర్మన్ వేములవాడ మదన్‌మోహన్, అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ప్రశాంత్‌చారి, ప్రధాన కార్యదర్శి పబ్బోజు భిక్షపతిచారి, కోశాధికారి మహేశ్వరపు సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు చొప్పదండి రామకృష్ణచారితో కలిసి విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

నేటి నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో

డ్వాక్రా చేనేత హస్తకళా ప్రదర్శన

కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీ సాయి డ్వాక్రా చేనేత హస్తకళ ప్రదర్శనను గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తున్నామని నిర్వాహకురాలు కె. పద్మజ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రదర్శనలో 100 స్టాల్స్ ఉంటాయని, అన్ని రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారుచేసిన దుస్తులు, చీరలు, వస్తువులు, హస్తకళలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. చేనేత కార్మికులు తయారుచేసిన వస్తువులు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే అందించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సెప్టెంబర్ 29వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో అల్పాహారం పంపిణీ

చిక్కడపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని లయన్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో డా. జీకే రమణ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో పేదలకు అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

కదం తొక్కిన కార్మికులు

- మధ్యాహ్న భోజన పథకాన్ని హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించొద్దు
- 400 మందికి పైగా కార్మికుల అరెస్టు



విద్యా శాఖ కార్యాలయం ముట్టడికి యత్నిస్తున్న కార్మికులు

ఖైరతాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఆ పథకం కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులు సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి బుధవారం యత్నించారు. దాదాపు 430 మంది కార్మికులను ఖైరతాబాద్ పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి, బోయిన్‌పల్లి, షాయినాత్‌గంజ్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లతో పాటు హెడ్ క్వార్టర్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) అధ్యక్షురాలు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి రమ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది కార్మికులు 24 సంవత్సరాలుగా ఎన్నో కష్టనష్టాలకోర్చి పని చేస్తుండగా ప్రస్తుతం వారందరి బతుకులు బజారున పడేలా ముఖ్యమంత్రి హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్‌కు మధ్యాహ్న భోజన పథకం మొత్తాన్ని అప్పగించేందుకు వారితో ఒప్పందం చేసుకునేందుకు సమాయత్తమయ్యారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెలా రూ.10 వేల వేతనం ఇప్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ నిరసన



లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు



ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న మాల మహానాడు నాయకుడు జంగా శ్రీనివాస్ తదితరులు

కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ భారత్ బంద్ పిలుపులో భాగంగా బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు నిరసన వ్యక్తం చేశారు. సమితి జాతీయ ఛైర్మన్ దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వంచిత్ బహుజన్, ఆఘాడి అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు జేఎస్‌రావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, జైబీమ్ సేన అధ్యక్షుడు పి. బాలవంత్, దిశ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఇందిర, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్. అశోక్, లోక్‌జనశక్తి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్‌రావు, ఎంఎల్ విమోచన, దళిత హక్కుల పోరాట సమితి నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులకు రాజ్యాధికారంలో వాటా దక్కకుండా బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని వారు ఆరోపించారు. ఐకమత్యంగా ఉంటున్న దళితుల మధ్య మాల, మాదిగ వత్యాసం తీసుకువచ్చేందుకే ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను తెరపైకి తీసుకువచ్చారన్నారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

ముషీరాబాద్‌లో..

రాంనగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో-కన్వీనర్ జంగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో భారత్‌బంద్ నిర్వహించారు. ముషీరాబాద్ డిపోలో నుంచి బస్సులను బయటకు రాకుండా మాల మహానాడు నాయకులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి ముషీరాబాద్ పీఎస్‌కు తరలించారు. అరెస్టులను నిరసిస్తూ పీఎస్‌లో మాల మహానాడు నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పి. లోకేశ్వర్‌రావు, జంబిక తిరుమలరావు, ఎం.భానుప్రసాద్, మద్దెల ప్రభాకర్, కోల్లూరి లక్ష్మణ్, శివకుమార్, స్వామిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాల సంఘాల నాయకులను విడుదల చేయాలి

నల్లకుంట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుతంగా భారత్ బంద్ నిర్వహిస్తున్న మాల సంఘాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని మాల మహానాడు నేతలు ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాలుక రాజేష్, సీనియర్ న్యాయవాది ఎన్.ఇ. మహేందర్, నాయకులు కె. అనిల్‌కుమార్, బి. రాంచందర్ మాట్లాడారు. విద్య, ఉపాధి, ఆర్థిక పరిస్థితులు కులగణనపై అధ్యయనం లేకుండా వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తగదన్నారు. అన్యాయమే చట్టమైనప్పుడు ఎదిరించడమే మాలల ధ్యేయమని వారు పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక రాజకీయ కుట్ర ఉందని వారు ఆరోపించారు.

ఐఏఎస్, ఐపీఎస్ పోస్టుల ప్రైవేటైజేషన్ దుర్మార్గం

- లేటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేయాలి : ఆర్. కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటైజేషన్ చేయడం దుర్మార్గమైన చర్య అని, ఈ విధానానికి మోదీ ప్రభుత్వం తక్షణమే స్వస్తి పలకాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కులగణనపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇటీవల కేంద్ర కేబినెట్ లేటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా 45 మందిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో భర్తీ చేయాలని నిర్ణయించడం ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటైజేషన్ చేయడమేనని ధ్వజమెత్తారు. ఈ విధానం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులు దక్కకుండా మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికే కేంద్రంలో 1,670 ఐఏఎస్, 1,482 ఐపీఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయకుండా దొడ్డిదారిన రాజకీయ కార్యకర్తలను భర్తీ చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలో భాగమే లేటరల్ ఎంట్రీ విధానం అని, దీన్ని రద్దుచేయకపోతే దేశాన్ని స్తంభింపజేస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. దీనిపై ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



సామూహిక నిరాహారదీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్‌ను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఉపాధ్యాయులు సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 12 ఏళ్ల నుంచి ఎందుకు ప్రమోషన్ ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. టీజీటీలను జూనియర్ లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

ఫెడరేషన్ అధ్యక్షుడు బి. కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్. మహేష్ మాట్లాడుతూ.. సర్వీసులో మరణించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకే నియామక పరీక్ష ద్వారా ఎంపికై ఆలస్యంగా నియామకం పొందిన ఉపాధ్యాయులకు వేతన వ్యత్యాసాలు తొలగించేందుకు నోషనల్ సర్వీస్ కల్పించాలన్నారు. నిరాహార దీక్షలో టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కె. జంగయ్య చావ రవి, ఫెడరేషన్ కోశాధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయండి



ధర్నాలో వల్లభనేని ప్రసాద్, భారతి, కె. వెంకటేష్‌గౌడ్, దివ్యాంగులు

కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి. భారతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ(డీఎస్‌డీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల పింఛన్ రూ. 6 వేలకు పెంచాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. దివ్యాంగుల అభివృద్ధి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని, దివ్యాంగుల హక్కుల చట్టం 2016ని పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లను నెలరోజుల్లోపు నెరవేర్చకపోతే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ధర్నాలో దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'విషజ్వరాలు విజృంభిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం'

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విషజ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా ఆరోపించారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభం

చిక్కడపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అరుంధతినగర్ బస్తీలో మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 23న విగ్రహ ప్రతిష్ఠ, 25న బోనాల వేడుక జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్వికరణ, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



నాలాలో దూకిన మహిళను కాపాడుతున్న స్థానికులు

హుస్సేన్‌సాగర్ నాలాలో దూకి

మహిళ ఆత్మహత్యాయత్నం

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో గొడవల కారణంగా ఓ మహిళ హుస్సేన్‌సాగర్ నాలాలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. బోయిగూడ సున్నంబట్టి ప్రాంతంలో నివసిస్తున్న మంజుల(40) కుటుంబంలో గొడవల కారణంగా కుమారుడు దూషించడంతో మనస్తాపం చెందింది. బుధవారం హుస్సేన్‌సాగర్ నాలాలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు ఆమెను కాపాడారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిళ్ల

టౌన్‌ప్లానింగ్ ఏసీపీలుగా దేవేందర్, సుమిత్ర

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా రాంశెట్టి దేవేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన రఘునందన్‌రాజ్ సికింద్రాబాద్ జోన్‌కు బదిలీ అయ్యారు. ఎల్.బి.నగర్ జోనల్ కార్యాలయంలో ఏసీపీగా పనిచేసిన దేవేందర్ ముషీరాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిర్దీత గడువులోపు అనుమతి ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

- అంబర్‌పేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా సుమిత్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వీరాస్వామి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సుమిత్ర హెడ్ ఆఫీస్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అభ్యుదయ స్కూల్ లేన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

గాంధీనగర్‌లో రూ. 80 లక్షలతో సివరేజీ పైపులైన్

చిక్కడపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం అభ్యుదయ స్కూల్ ప్రాంతంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో రూ. 80 లక్షల వ్యయంతో సివరేజీ పైపులైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువు

- దాడులకు నిరసనగా 24న రౌండ్ టేబుల్ సమావేశం

చార్మినార్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువైందని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈనెల 24న సిటీ సివిల్ కోర్టులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కోర్టు ప్రాంగణంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల బోరబండ, సిద్దిపేట, జనగామలో వరుసగా న్యాయవాదులపై పోలీసుల దాడులు జరిగాయని, ప్రభుత్వం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు న్యాయవాదులు బర్కా రాజేష్‌కుమార్, సుధాన్షు, విశాల్ సింగ్, ప్రవీణరెడ్డి, జశ్వంత్ కౌర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు,



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

డాక్టర్ హంతకులను కఠినంగా శిక్షించాలి

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేకుండా పోతుందని బ్యాంకు మహిళా ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యను నిరసిస్తూ లిబర్టీలోగల ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం వద్ద ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో పలు బ్యాంకుల మహిళా ఉద్యోగులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు మాట్లాడుతూ.. డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పీవీ కృష్ణారావు, మీనాక్షి, జి. పద్మ, రేఖ, మంజుల, సుప్రియ సార, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి బోధనలను ఆచరించాలి

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి చౌరస్తాలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో బుధవారం జరిగిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాఘవేంద్రస్వామి బోధనలను ప్రతిఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాఘవేంద్రస్వామి బృందావన సమితి అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి, కర్యదర్శి బి.పి రాఘవేందర్‌రావు, మేనేజర్ నర్సింహచార్యులు, బర్కత్‌పుర రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ సూర్యచంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.







రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు తదితరులు